క్లుప్తంగా

వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

నెహ్రూనగర్: ఏకమొత్తంగా చెల్లించే ఆస్తి, ఖాళీ స్థల పన్నులపై వడ్డీని మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి కోరారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం డెప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులు నగరంలోని పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లారు. పన్ను చెల్లింపు, పన్ను రాయితీపై ఆయా డిపార్టుమెంటు అధికారులకు వివరించారు. ఆస్తి, ఖాళీ స్థల పన్నుపై కల్పించిన రాయితీ సువర్ణావకాశమని, ఈ నెలాఖరులోపు చెల్లించి వడ్డీ రాయితీని పొందాలని సూచించారు. పన్ను రాయితీ అవకాశం మళ్లీ రాకపోవచ్చని, అవసరమైతే ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించుకొని చెల్లించాలని కోరారు.

కెటిల్‌బెల్ పోటీల్లో నగర క్రీడాకారులకు పతకాలు



గుంటూరు మెడికల్: పుణేలో మార్చి 18 నుంచి 19 వరకు జరిగిన జీఎస్ఐఎఫ్ నేషనల్ చాంపియన్‌షిప్, డబ్ల్యూకేఎస్ఎఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ట్రోఫీలో జాతీయ స్థాయి కెటిల్ బెల్ పోటీల్లో గుంటూరుకు చెందిన ముగ్గురు క్రీడాకారులు సత్తా చాటారు. ఎండీ.జావిద్ అహ్మద్, డాక్టర్ సి.నీలిమ, ఎండీ. మొయిన్ కెటిల్‌బెల్ రెస్ప్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించి, జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో చోటు సంపాదించారు. గుంటూరు లలితా హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ శుక్రవారం ముగ్గురు క్రీడాకారుల్ని అభినందించారు.

నేడు నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ 2023–24 వార్షిక బడ్జెట్‌ను శనివారం నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అధ్యక్షతన ప్రవేశపెట్టనున్నారు. రూ.1377.53 కోట్లకు కొద్ది రోజుల కిందట స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. నగర పాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో శనివారం కౌన్సిల్ తీర్మానం నిమిత్తం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు.

చికెన్ షాపు సీజ్



నెహ్రూనగర్: నగరంలో వార్డు సచివాలయాల వారీగా శుక్రవారం అడ్మిన్, శానిటేషన్ కార్యదర్శులు సచివాలయం పరిధిలోని వ్యాపార వాణిజ్య సంస్థల్ని తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్, ట్రేడ్ ఫీజులు చెల్లింపుపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంగళదాస్ నగర్‌లోని ఓ చికెన్ షాప్ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోకుండా, పాత బకాయిలు చెల్లించకుండా వ్యాపారం చేయడం గమనించారు. సదరు షాపును శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, శానిటేషన్ కార్యదర్శులు సీజ్ చేశారు.

26న కళాలయ మెలోడీస్ సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియం వేదికగా ఈ నెల 26న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాలయ మెలోడీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏ.వి. రత్నాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో గాయకులు పలు చిత్రాల్లోని పాటల్ని ఆలపిస్తారని పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మనోవికాసానికి ధ్యానం దోహదం



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మనోవికాసానికి ధ్యానం' అనే అంశంపై అవగాహన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ధ్యాన శిక్షకులు జి. వెంకటరామయ్య, పిచ్చిరెడ్డి, శారద పాల్గొన్నారు. ధ్యానం విశిష్టతను భక్తులకు వివరించారు. మనోవికాసానికి, ఆరోగ్యానికి దోహదం చేస్తుందని వివరించారు. సభ అనంతరం భక్తుల సందేహాల్ని వెంకటరామయ్య నివృత్తి చేశారు. కార్యక్రమంలో నూతలపాటి తిరుపతయ్య, మన్నె సుబ్బారావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు.

• రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం శుక్రవారం ప్రారంభం కావడంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. తెల్లవారుజాము 4.53 నిమిషాలకు సెహ్రి (ఉపవాస దీక్ష)ను ప్రారంభించారు. సాయంత్రం 6.24 నిమిషాలకు వరకు చిన్నారులు, మహిళలు, వృద్ధులు సైతం భక్తిశ్రద్ధలతో పాటించారు. రంజాన్ నెల మొదటి రోజు, మొదటి శుక్రవారం నేపథ్యంలో ముస్లింలు అధిక సంఖ్యలో మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీక్ష అనంతరం పండ్లు, ఖర్జూరాలు కొనుగోళ్లతో మసీదుల వద్ద సందడి నెలకొంది.

పాత గుంటూరు



కోబాల్ట్‌పేటలోని మసీద్-ఎ-బైతుల్ ముకర్రమ్‌లో దువా చేస్తున్న ముస్లింలు





బలమైన రంగంగా తయారీ పరిశ్రమ

- మిశ్రమ పదార్థాలకు పెరిగిన ప్రాధాన్యత
- అపారమైన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి
- హైదరాబాద్ మిథాని సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ జా



సదస్సును ప్రారంభిస్తున్న హైదరాబాద్ మిథాని సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ జా

ఏఎన్‌యూ: తయారీ రంగం నేడు బలమైన రంగంగా ఎదిగిందని హైదరాబాద్ మిథాని సంస్థ సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ జా తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ' రీసెంట్ ట్రెండ్స్ ఇన్ కాంపోజిట్ మెటీరియల్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ కుమార్ జా ప్రసంగిస్తూ మిశ్రమ పదార్థాలకు రోజురోజుకూ ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. రక్షణ, వైమానిక, అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధలు తదితర రంగాల్లో ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు. మిశ్రమ పదార్థాలు, సంబంధిత అంశాలపై విద్యార్థులు మరింత అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. విక్రమ్ సారాబాయ్ అంతరిక్ష కేంద్రం డీడీ డాక్టర్ షాజీ థామస్ ప్రసంగిస్తూ కీలక అంశాలపై విద్యార్థులు పరిశోధనలు చేయాలని సూచించారు. డీఆర్‌డీఓ ఎఎస్‌డీఎల్ అసోసియేట్ డైరెక్టర్ పి.వి.ఎస్. గణేష్‌కుమార్, ఆమోర్ టెక్నాలజీ ప్రతినిధి బి. రామకృష్ణ, హైదరాబాద్ ఐఐటీ ఆచార్య కె. భానుశంకర్, ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధయ్య, మెకానికల్ విభాగాధిపతి గోపీకృష్ణ, సదస్సు డైరెక్టర్ విజయ ప్రకాష్ ప్రసంగించారు.

సాంకేతికతతో అంతర్జాతీయ వ్యాపారం సులువు

శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధిస్తున్న పురోగతి ఫలితంగా అంతర్జాతీయ వ్యాపారం సులభతరమైందని నాగార్జున యూనివర్సిటీ వీసీ పి. రాజశేఖర్ తెలిపారు. ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ బిజినెస్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు జాతీయ సదస్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ విద్యార్థులంతా అంతర్జాతీయంగా జరుగుతున్న మార్పుల్ని నిరంతరం అధ్యయనం చేయాలని సూచించారు. ఐఐఎం అహ్మదాబాద్ అధ్యాపకుడు నరసింహన్ రవిచంద్రన్ ప్రసంగిస్తూ వినియోగదారుని అభిరుచులకు అనుగుణంగా ప్రపంచ వ్యాపార పోకడలు నిత్యం నూతనత్వాన్ని సంతరించుకుంటోందని చెప్పారు. ఐఐఎం లక్నో ప్రొఫెసర్ ఎస్. వెంకట్ మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాపార రంగంలో సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. మిజోరాం సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఎన్.వి.ఆర్ జ్యోతి కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాపార రంగలో సృజనాత్మకత పెద్దపీట వేస్తుందన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రి బిజినెస్ విభాగ అధ్యాపకుడు సత్యగోపాల్ మాట్లాడుతూ అగ్రి బిజినెస్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు శ్రీనివాసులు ప్రసంగిస్తూ రానున్న రోజుల్లో సాంకేతికత మరింత క్రియాశీలకం కానుందని చెప్పారు. సదస్సు డైరెక్టర్ శివరామ ప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా వ్యాపార అవకాశాలకు కొదవ లేదని, సరైన సమయంలో సరైన వేదిక నుంచి వాటిని నిర్వహించగలగాలని తెలిపారు. పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూని సందర్శించిన ఆర్టీఐ కమిషనర్లు

ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ కమిషనర్లు యు. హరిప్రసాద్‌రెడ్డి, పి. శామ్యూల్ జోనాథన్ శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. యూనివర్సిటీలో విద్య, పరిశోధన, క్రీడలు, మౌలిక వసతుల అభివృద్ధి అంశాలను వీసీ వారికి వివరించారు. కార్యక్రమంలో ఐఎస్‌సీ డైరెక్టర్ జి. చెన్నారెడ్డి, యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ జి. అనిత, జర్నలిజం విభాగ అధ్యాపకులు జె. మధుబాబు ప్రసంగించారు.

జర్నలిజానికి దేవిరెడ్డి సేవలు ఎంతో విలువైనవి

జర్నలిజం రంగానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి విలువైన సేవలు అందించారని ఏఎన్‌యూ వీసీ పి. రాజశేఖర్ తెలిపారు. దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మృతి పట్ల ఏఎన్‌యూలో శుక్రవారం వీసీ సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, యూనివర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ జి.అనిత పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం చారిత్రాత్మకం



సమావేశంలో బాలస్వామి తదితరులు

నెహ్రూనగర్: దళిత క్రైస్తవుల్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయడం అభినందనీయమని, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రాష్ట్ర క్రైస్తవ నాయకుడు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మద్దు బాలస్వామి పేర్కొన్నారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ఇచ్చిన రాజ్యాంగపు ఉత్తర్వులోని 3వ పేరాను తొలగించాలని దళిత క్రైస్తవ సంఘాలు 70 సంవత్సరాలుగా పలు ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయని గుర్తు చేశారు. దళిత క్రైస్తవులకు కేంద్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ అవకాశాలు, రాజకీయ అధికార పదవులు, న్యాయ, ఆర్థికపరమైన రక్షణలు కల్పించడంలోనూ అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈనాడు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులకు అండగా ఉంటూ వారికి ఎస్సీ హోదా కల్పించాలని తీర్మానం చేయడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలోని దళిత క్రైస్తవులంతా ఆయనకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ తీర్మానాన్ని పార్లమెంటులో ఆమోదం తెలిపి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో క్రైస్తవ సంఘాల నాయకులు కర్రా హనోక్ బెంజిమెన్, నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్పీకి ఉగాది పురస్కారం



నగరంపాలెం: గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజకు ఉగాది పురస్కారం అందజేశారు. డీపీఓలోని ఏఎస్పీ కార్యాలయంలో భారతి సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల్లో భాగంగా వీరనారి లక్ష్మి అవార్డును శుక్రవారం అందజేశారు. అనంతరం ఆమెను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు, సేవాసదన్ సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యుడు ఆర్.సదాశివరావు, బండి రామయ్య, కె.విజయ చంద్ర పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అన్నా నందకిశోర్, శ్రీలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) బుధవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అత్యధిక ర్యాంకులతో ఉత్తీర్ణత శాతాన్ని సాధించినట్లు శ్రీమేధ విద్యాసంస్థల చైర్మన్ అన్నా నందకిశోర్ తెలిపారు. బ్రాడీపేటలోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో విద్యార్థి సి.లక్ష్మీకాంత్ అఖిల భారతస్థాయిలో 14వ ర్యాంకు, ఎం. అంజలి 49వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో ఏడు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. ఎస్. శివారెడ్డి 3వ ర్యాంకుతో పాటు టి.రోహిత్ 22వ ర్యాంకు, పి.మణికంఠలక్ష్మి 24, పి.లోకేష్ 39, ఏ.వెంకటసాయి వర్షిత్ 40, కేవీఎల్ ప్రత్యూష 45, ఎం.సువర్చలాదేవి 47వ ర్యాంకు సాధించారని వివరించారు. సబ్జెక్టుల వారీగాను అధిక ఉత్తీర్ణత శాతం సాధించామని తెలిపారు. సీఎంఏ ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈనెల 27 నుంచి సీఎంఏ ఫైనల్ తరగతులు, సీఎంఏ ఇంటర్లో ఫెయిలైన విద్యార్థులకు స్టడీ అవర్స్, రివిజన్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. విద్యార్థుల్ని నందకిశోర్‌తో పాటు సంస్థ కార్యదర్శి అన్నా శ్రీలక్ష్మి జ్ఞాపికలు బహూకరించారు.

ఇన్‌స్పైర్ మానక్ పోటీలకు 10 మంది ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: కాకినాడలో గురు, శుక్రవారాల్లో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి. ప్రతాప్‌రెడ్డి నేతృత్వంలో కాకినాడ ఆర్జేడీ చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఇన్‌స్పైర్ మానక్ రాష్ట్రస్థాయి పోటీల్లో భాగంగా జాతీయస్థాయికి ఎంపికైన 35 ప్రాజెక్టుల్లో 10 మంది ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన విద్యార్థులే కావడం వారిలోని ప్రతిభకు నిదర్శనం. పఠాన్ బాజిద్ బీ, కాకుమాను స్వర్ణ, సీకే జూనియర్ కాలేజ్ హైస్కూల్ (మంగళగిరి), ఏ. గోవర్ధన్‌బాబు, జెడ్పీ హైస్కూల్, అత్తోట (తెనాలి), ఏ. విజయ్‌కుమార్, జెడ్పీ హైస్కూల్, నండూరు (పొన్నూరు), కె.మహాలక్ష్మీ తిరుపతమ్మ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీవీపాలెం (బాపట్ల), కె.సుబ్బారావు, మున్సిపల్ హైస్కూల్ (పొన్నూరు), షేక్ యూసఫ్ అలీషా, జెడ్పీ హైస్కూల్, తక్కెళ్లపాడు (పెదకాకాని), వేల్పూరు అఖిల, జెడ్పీ హైస్కూల్, సీహెచ్ పాలెం (కాకుమాను), వై. లక్ష్మీదీపిక, వీఎస్సార్–జెడీఎం జెడ్పీహెచ్ఎస్, అంగలకుదురు (తెనాలి), డి. శ్రీవల్లి, ఎంపీయూపీఎస్, రాచమల్లపాడు (వెల్దుర్తి) ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈవోలు పి. శైలజ, కె. శామ్యూల్, పీవీజే రామారావు అభినందించారు.

పరిశోధనల వైపు ఆసక్తి పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాండిచ్చేరి యూనివర్సిటీ మాజీ వీసీ అనిల్ కె. భట్నాగర్

చేబ్రోలు: విద్యార్థులంతా పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని పాండిచ్చేరి యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ అనిల్ కె.భట్నాగర్ సూచించారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫంక్షనల్ మెటీరియల్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా భట్నాగర్ మాట్లాడుతూ మానవ జీవనానికి ఫిజిక్స్ మూలమని, దానిపై విరివిగా పరిశోధనలు జరగాలని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ వి.వి.ఎస్.ఎస్. శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక యుగంలో మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్‌కు ప్రాధాన్యత గణనీయంగా పెరిగిందని తెలిపారు. ప్రకృతిలో దొరికే మూలకాలపై అవగాహన పెంచుకోవాలని, విద్యార్థులు వినూత్న ప్రయోగాలు చేసి మానవకోటికి ఉపకరించే అధునాతన పరికరాలు ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ పి.నాగభూషణ్, డీన్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్ మోసంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టుగుంట సెంటర్‌కు చెందిన షేక్ సాదిక్ ఉద్యోగం కోసం నౌకరీ డాట్ కామ్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. శుక్రవారం ఓ వ్యక్తి ఫోన్ చేసి దరఖాస్తు చేసుకున్న 12 ఉద్యోగాలకు రూ. 15వేలు చెల్లించాలని కోరగా, సాదిక్ ఆ మొత్తాన్ని చెల్లించాడు. అనంతరం పలు కారణాల పేరిట పలు దఫాలుగా రూ. 3,05,000 చెల్లించాడు. అయినప్పటికీ, మరో రూ. 5 లక్షలు కట్టాలని ఆ వ్యక్తి కోరడంతో సాదిక్ మోసపోయినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సింగిల్ నంబరు లాటరీ నిర్వహిస్తున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటుకూరు రోడ్డులోని సింహపురి ఎస్టేట్ వద్ద సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 5,400 స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

విస్తరణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలి

కమిషనర్ కీర్తి చేకూరి



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో విస్తరణ పనులు చేపట్టిన రోడ్లలో నగరపాలక సంస్థ నుంచి ఎటువంటి పెండింగ్ పనులున్నా రెండు రోజుల్లో పూర్తి చేయాలని, టీడీఆర్ బాండ్లు ఇవ్వడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పెద్దపలకలూరు, నందివెలుగు, కుగ్లర్ హాస్పిటల్, ఏటీ అగ్రహారం రోడ్లు దాదాపు పూర్తయిన దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. విస్తరణ జరిగిన ప్రాంతాల్లో టీడీఆర్ బాండ్లు ఇవ్వడానికి ఆధార్ సీడింగ్, ఇతర సాంకేతిక పనులు పూర్తి చేయాలని టీపీఎస్‌లను ఆదేశించారు. చిన్నేరుకుంట, గడ్డిపాడు చెరువు చుట్టుపక్కల ఆక్రమణదారులకు తొలగింపు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబూరావు, అజయ్ కుమార్, అశోక్ కుమార్, టీపీఎస్‌లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, సహనం నేర్పేదే రంజాన్ మాసం

ఎమ్మెల్యే ముస్తఫా



గంజి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ధర్మం, దానం, క్రమశిక్షణ, సహనం నేర్పేదే రంజాన్ మాసమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. 12వ డివిజన్ లాలాపేటలో శుక్రవారం సయ్యద్ కరామత్ ఆధ్వర్యంలో గంజి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రతి ముస్లిం రంజాన్ నెలంతా కఠిన ఉపవాసం పాటిస్తూ, పండుగ వరకు నియమ నిబంధనలతో జీవనం కొనసాగిస్తారని తెలిపారు. ఉపవాసం విరమించిన తరువాత పండ్లు, గంజి వంటి తేలికపాటి ఆహార పదార్థాలు తీసుకుంటారని చెప్పారు. గంజి పంపిణీని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో 12వ డివిజన్ కార్పొరేటర్ ఖాజా మొహద్దీన్ చిష్టి, మూసా, తాజు, ఖాదర్ పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీ కళాశాలలో ఒమేగా హెల్త్‌కేర్ క్యాంపస్ డ్రైవ్



హెచ్‌ఆర్ మేనేజర్ విజయన్ శేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఒమేగా హెల్త్‌కేర్, ఓరియన్ సొల్యూషన్స్ సంయుక్తంగా పూల్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. వివిధ ఫార్మసీ కళాశాలల నుంచి 163 మంది విద్యార్థులు హాజరవ్వగా, వారిలో 100 మంది రాత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. వీరందరికీ వచ్చే నెలలో ఆన్‌లైన్ ద్వారా తుది విడత ఎంపిక ప్రక్రియ నిర్వహించి, ఉత్తీర్ణులైన వారికి నియామక పత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ఇంటర్వ్యూల ప్రక్రియను కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, ప్లేస్‌మెంట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ విజయన్ శేఖర్, ధరుణ్, కె. వికాస్, టీనా పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ సభ్యులు కె. రామలింగేశ్వరరావు, శర్మశ్రీ , అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇనాం భూముల సమస్యలు పరిష్కరించండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ విన్నపం



పట్నంబజారు: గుంటూరు నగరంలో ఇనాం భూముల సమస్యలు అధికంగా ఉన్నాయని, గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు నిలిపివేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీలో ఆయన పలు సమస్యల్ని ప్రస్తావించారు. ఏటీ అగ్రహారం, రామిరెడ్డినగర్‌లో 35 ఎకరాల ఇనాం భూములు ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ నిలిపివేయడం వల్ల పిల్లల చదువుల నిమిత్తం బ్యాంకులో పెట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానికులు చెబుతున్నారన్నారు. ఈ సమస్య గుంటూరులోనే కాకుండా, రాష్ట్రంలో సైతం అనేక ప్రాంతాల్లో ఉందని, ఈ భూముల్ని రెగ్యులరైజ్ చేయాలని విన్నవించారు. గుంటూరు నగరంలో అత్యంత కీలకమైన శంకర్ విలాస్ బ్రిడ్జి 1957లో నిర్మించారని, అప్పటి ట్రాఫిక్ పరిస్థితుల్ని బట్టి నిర్మించిన నేపథ్యంలో ఇప్పటి జనాభా పెరిగిన పరిస్థితుల్లో మరలా నిర్మాణం చేపట్టాలని కోరారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని, ఆరు లైనులుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి, నిర్మాణ పనులు చేపట్టాలని మనవి చేశారు. శ్యామలానగర్ రైల్వే గేటు సైతం నిర్మించి 30 సంవత్సరాలు అవుతోందని, ఇప్పటి పరిస్థితుల్లో జనాభా పెరగడంతో విద్యార్థులు, ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. ఆర్‌యూబీ నిర్మాణ పనులకు అంచనాలు సిద్ధం చేసి ఉంచామని, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యకర జీవనం

భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ సత్యవతి

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబం ఆహారంలో చిరుధాన్యాల్ని తప్పనిసరిగా చేర్చుకుంటే ఆరోగ్యంగా జీవించగలమని భారతీయ చిరుధాన్యాల సంస్థ డైరెక్టర్ డాక్టర్ సి.తార సత్యవతి సూచించారు. నగర శివారు లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో గల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని సామాజిక విజ్ఞాన కళాశాలలో, భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) ఆధ్వర్యంలో శుక్రవారం మిల్లెట్స్ అండ్ మహిళ అనే సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మనిషికి సరైన పౌష్టికాహారాన్ని అందించేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డి చిరుధన్యాల వినియోగం, ఆరోగ్యం మెరుగు గురించి వివరించారు. విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకురాలు ఎల్. ప్రశాంతి మాట్లాడుతూ చిరుధాన్యాలను ప్రతి రోజు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసి కుటీర పరిశ్రమగా స్థాపించిన అనంతపురం జిల్లా రోళ్ల గ్రామానికి చెందిన కె. శ్యామల, ఆముదాలవలసకు చెందిన ఎస్. సుజాత, విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన బి. శ్యామలను సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా మీడియా మెటీరియల్ బ్లాగ్, పాటలు, పోస్టర్లను విడుదల చేశారు. మహిళలకు చిరుధాన్యాల వంటల పోటీల్ని నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టి.వి. హైమావతి, నీరజ, సి.మాధవీలత, చిరంజీవి, ఎం.ఎస్. చైతన్యకుమారితో పాటు 300 మందికి పైగా డీఆర్‌డీఏ మహిళలు పాల్గొన్నారు.